# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 10-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం సహా అన్ని రంగాల్లో ప్రవాస భారతీయులు రాణిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- మధ్య, అల్పాదాయ వర్గాలకు కొత్త "అమృత్ భారత్" రైలు సేవలను త్వరలో ప్రవేశపెట్టనున్నామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- మహాకుంభ మేళా 2025కు సంబంధించి "ఆకాశవాణి కుంభవాణి" రేడియో ఛానెల్ ను ఈరోజు ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించారు.
- భారతదేశం 2025లో రక్షణ, ఏరోస్పేస్ ఆవిష్కరణలలో ప్రపంచ నాయకునిగా మరింత బలపడుతుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.

===========================

వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం సహా అన్ని రంగాల్లో ప్రవాస భారతీయులు రాణిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. భువనేశ్వర్ లోని జనతా మైదానంలో ఈ రోజు జరిగిన 18వ "ప్రవాసీ భారతీయ దివస్ సదస్సు" ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. ప్రవాస భారతీయ సమ్మాన్ ను వివిధ రంగాల్లో రాణించినందుకు ప్రవాస భారతీయులకు ఆమె ప్రదానం చేశారు. ప్రవాస భారతీయులు ప్రపంచ సమాజానికి దేశం యొక్క నిజమైన చిత్రాన్ని ప్రతి బింబిస్తారని రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

మధ్య, అల్పాదాయ వర్గాలకు నాణ్యమైన సేవలు అందించే కొత్త అమృత్ భారత్ రైలు సేవలను త్వరలో ప్రవేశపెట్టనున్నామని కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈరోజు ఆయన తమిళనాడులోని తిరువళ్లూరులోని టిటాగర్ రైల్ సిస్టమ్స్ కంపెనీల్లోని చక్రాల తయారీ యూనిట్ ను, చెన్నై లోని

ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) ఫర్నిషింగ్ షెడ్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2026 నుంచి "మేకిన్ ఇండియా పథకం" కింద ప్రైవేటు సంస్థల సహకారంతో రైళ్లకు చక్రాలను తయారు చేస్తామని వెల్లడించారు. భారత్ లో తయారయ్యే చక్రాలను, దేశంలో తయారయ్యే రైళ్లు, మెట్రో రైళ్లకు వినియోగించడమే కాకుండా... ఇతర దేశాలకు ఎగుమతి చేస్తామని స్పష్టం చేశారు. దేశంలోని పౌరులందరికీ ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా "అమృత్ భారత్ 2.0"ను ప్రారంభించామని కేంద్రమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

==========================

వికసిత్ భారత్ సాధనకై 2047 నాటికి అన్ని సమస్యలకు పరిష్కారాలను కోరుకుంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త నిఖిల్ కామత్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి పలు విషయాలను వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను 100 శాతం అందజేయాలని, అదే సామాజిక న్యాయం, లౌకికవాదానికి నిజమైన రూపమని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. మనిషిగా తప్పులు చేయవచ్చని, కానీ చెడు ఉద్దేశ్యంతో తప్పులు చేయనని పేర్కొన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే అంకితభావం, నిబద్ధత ఉండాలని, జట్టులో మంచి సభ్యునిగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రధానమంత్రి వివరించారు.

==========================

జమ్మూ కాశ్మీర్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ రోజు జమ్మూ & కాశ్మీర్ సమాచార హక్కు (RTI) ఆన్‌లైన్ పోర్టల్‌ను జమ్మూ పౌర సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ RTI చట్టం, ప్రభుత్వ సమాచారాన్ని పౌరులకు సులభంగా, వేగవంతంగా, పారదర్శకంగా పొందే అవకాశం కలిపిస్తున్నాదని అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో అంతటా పౌరులు ఈ చట్టం ప్రయోజనాల గురించి తెలుసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

==========================

రాఫెల్ తుఫాను నేపథ్యంలో క్యూబా ప్రజలకు భారత్ మానవతా సాయం అందించింది. యాంటీబయాటిక్స్, యాంటీ పైరెటిక్స్, పెయిన్ కిల్లర్స్, ఓఆర్ఎస్ లతో కూడిన అత్యవసరమైన ఔషదాల సరుకు క్యూబాకు బయలుదేరిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమ వేదికగా తెలియజేశారు.

విరామం

==========================

మహాకుంభ్ 2025కి అంకితం చేయబడిన "ఆకాశవాణి కుంభవాణి" ఛానెల్ ను ఈరోజు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కుంభవాణి ప్రజాదరణలో కొత్త శిఖరాలను చేరుకుంటుందని, మారుమూల గ్రామాలకు కూడా మహాకుంభ స్ఫూర్తిని విస్తరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మహాకుంభ మేళాకు హాజరుకాలేని వారికి, మహాకుంభానికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని అందించడానికి ఈ ఛానెల్ ఎంతో ఉపకారిగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలను జానపద సంప్రదాయాలు, సంస్కృతితో అనుసంధానం చేసే తొలి మాధ్యమం ఆకాశవాణి అని ముఖ్యమంత్రి ప్రసంశిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

అలాగే కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఈ కార్యక్రమంలో దృశ్య మాధ్యమ విధానంలో పాల్గొని రేడియో ఛానెల్‌ని ప్రారంభించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

===========================

భారతదేశం, 2025 రక్షణ, ఏరోస్పేస్ ఆవిష్కరణలలో ప్రపంచ నాయకునిగా మరింత బలపడుతుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూ ఢిల్లీలోని ఏరో ఇండియా 2025-అంబాసిడర్స్ రౌండ్ టేబుల్‌లో ఈ రోజు కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. స్వావలంబన, సాంకేతిక సహకారాన్ని పెంపొందించడంపై బలమైన దృష్టి సారించి, పటిష్టమైన రక్షణ, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం విధాన సంస్కరణలను చేపడుతున్నాదని అన్నారు. 4వ తరం యుద్ధ విమానాలు, అణు జలాంతర్గాములు, ప్రధాన యుద్ధ ట్యాంకులు, ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను ఉత్పత్తి చేయగల దేశాలలో భారతదేశం ఇప్పుడు ఉందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===========================

“వికసిత్ భారత్-2047” సాధించే దిశగా భారత్ వేగంగా పురోగమిస్తోందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. కేరళలో అవనీశ్వరంలోని ఏపీపీఎం వృత్తి విద్య ఉన్నత పాటశాలలో 'సుగత సౌక్మవనం' కార్యక్రమాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. దివంగత కవి, పర్యావరణవేత్త సుగతకుమారి 90వ జయంతిని పురస్కరించుకుని కేరళలోని 126 పాఠశాలల్లో 11 వేల 340 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయమంత్రి మాట్లాడుతూ... పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన “ఏక్ పేడ్.. మా కే నామ్..” ఉద్యమం పచ్చదనం, పరిశుభ్రమైన పర్యావరణం ప్రాముఖ్యతను ప్రోత్సహిస్తుందని వివరించారు.

===========================

రాజ్‌కోట్‌లోని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో ఈరోజు ఐర్లాండ్‌తో జరిగిన తొలి మహిళల వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బాటింగ్ చేసిన ఐర్లాండ్ జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ కు చేసిన భారత జట్టు 34.3 ఓవర్లలోనే 239 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

===========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 77 వేల 620 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 241 పాయింట్ల నష్టంతో 77 వేల 378 స్థిరపడింది. నిఫ్టీ 95 పాయింట్ల నష్టంతో 23 వేల 431 వద్ద ముగిసింది.

===========================
===========================